క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో విద్యార్థులు

సింథియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీలో గల పౌరగ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారని గ్రంథాలయాధికారి కనకరాజు తెలిపారు. విజేతలకు ముగింపు వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



భవనం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం వద్ద జీవీఎంసీ నిధులతో నిర్మించిన రజక సామాజికవర్గ కమ్యూనిటీ భవనాన్ని కార్పొరేటర్ గులిగిందల లావణ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా గుల్లలపాలెంలో రజకుల కోసం సామాజిక భవనం నిర్మించామన్నారు. ఈ భవనాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గులిగిందల కృష్ణ, గొందేశి సత్యనారాయణ రెడ్డి, సంతోష్, ధర్మాల వేణుగోపాలరెడ్డి, పెద్దాడ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

హిందూజా భూ నిర్వాసితుల ఆందోళన

పెదగంట్యాడ: హిందూజా పవర్ ప్లాంట్‌కు సంబంధించి రైల్ కారిడార్, వాటర్ పైప్‌లైన్‌ను వెంటనే నిర్మించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. అలాగే భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హక్కుల సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ హిందూజా పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న భూములను కూడా తీసుకుని నష్ట పరిహారం చెల్లించాలన్నారు. లేకపోతే వెంటనే రైల్వే ట్రాక్‌కు గుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. హిందుజా పవర్ ప్లాంట్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

పెన్షనర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న పింఛన్‌దారులు

సీతమ్మధార: కార్మికులంతా వ్యతిరేకిస్తున్నా సరే కేంద్ర ప్రభుత్వం శనివారం ఈపీఎస్–95 పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టడాన్ని పలువురు వక్తలు తప్పుపట్టారు. ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ పార్కులో పింఛన్‌దారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికులకు ఆప్షన్ కూడా ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించామని గుర్తుచేశారు. దీంతో ప్రతి పదేళ్లకోసారి సమీక్షించి మెరుగులు దిద్దుతామని కేంద్రం కోర్టుకు హామీ ఇవ్వగా.. కోర్టు కూడా కేంద్రానికి అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. పదేళ్ల తరువాత రివ్యూ పేరిట 1/3 వంతు పింఛన్ అమ్ముకునే హక్కు, భర్త చనిపోతే భార్యకు బీమా కల్పించే హక్కును తొలగించి కేంద్రం కార్మికులకు ద్రోహం చేసిందని వాపోయారు. గత ఎన్నికల ముందు బీజేపీ అధికారంలోకి వస్తే కనీస పింఛన్ రూ.9 వేలతోపాటుగా డీఏ అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీజేపీ కూటమి వచ్చి పదేళ్లు దాటినా.. కనీస పింఛన్ పెరగలేదన్నారు. ఈపీఎస్ స్కీమ్ 95 ప్రవేశపెట్టిన రోజును విద్రోహ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. యు.వి.ఎస్.ఎన్.వర్మ, కె.దీనబంధు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, పాల్గొన్నారు.

పూడిక తీసి... వదిలేస్తున్నారంతే..!



రామ్మూర్తిపంతులు పేటలో రహదారిపై వదిలేసిన పూడిక

- దుర్వాసన భరించలేకపోతున్న స్థానికులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- వర్షాలు కురిస్తే మళ్లీ గెడ్డల్లోకే పూడిక

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, గొల్ల కంచరపాలెం ప్రాంతాల్లో గెడ్డల్లో పూడిక, వ్యర్థాలు తొలగించిన తర్వాత అక్కడే వదిలేస్తుండడంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. గెడ్డలకు ఇరువైపులా వేసి.. నీరు ఇంకిన తర్వాత వ్యర్థాలు తరలిస్తుంటారు. ఇక్కడ మాత్రం పూడిక తొలగించి నెలలు గడుస్తున్నా శానిటరీ సిబ్బంది తరలించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఫలితంగా అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి వేసవిలో ప్రధాన గెడ్డల్లో జీవీఎంసీ టెండర్లతో కాంట్రాక్టర్లు పూడికలు తొలగించే కార్యక్రమం చేపట్టేవారు. ఈ ఏడాది వేసవిలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పనులు చేపట్టడానికి కుదరక వదిలేశారు. ఎట్టకేలకు గత నెలలో కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు కావడంతో జోన్ – 5 ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్ నేతృత్వంలో పూడికతీత పనులు చేపట్టారు. పూడికలు తొలగించి గెడ్డలకు ఇరువైపులా వేసి.. నెలల తరబడి వదిలేస్తుండడంతో వర్షాలు కురిసినప్పుడు చెత్త, మట్టి, వ్యర్థాలు మళ్లీ గెడ్డల్లోకి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలో పశువుల సంచారంతో వ్యర్థాలు చిందరవందరగా మారుతున్నాయని.. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు ముక్కుమూసుకునే పరిస్థితి కనిపిస్తోందని వాపోతున్నారు. పూడికలు తరలించమని పబ్లిక్‌హెల్త్ సిబ్బందికి ఫిర్యాదులు చేస్తే తమకు సంబంధం లేదని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఫిర్యాదులు చేయాలని చెబుతున్నారని... ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తే కాంట్రాక్టర్లకు చెప్పాలని.. వారే తొలగిస్తారని చెబుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్య జటిలం అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షించి సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.



గవర కంచరపాలెం ప్రధాన రహదారిలో పూడిక, వ్యర్థాలు



రైల్వేయార్డ్‌కు వెళ్లే రహదారి గెడ్డలో తొలగించి అక్కడే వదిలేసిన వ్యర్థాలు

పూడిక, వ్యర్థాలు తరలించాలి

మా ప్రాంతంలోని గెడ్డల్లో నుంచి పూడిక, వ్యర్థాలు తొలగించారు. రోజులు గడుస్తున్నా ఇక్కడి నుంచి తరలించడం లేదు. అటుగా వెళ్లాలంటే దుర్వాసన భరించలేకపోతున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పూడికలు తరలించాలని ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. పశువుల సంచారం ఎక్కువగా ఉంది. రోడ్లపైకి మట్టి రావడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు.

– పి.రాజ్యలక్ష్మి, గవర కంచరపాలెం.

అధికారులు స్పందించాలి

గెడ్డల్లో నుంచి తీసిన పూడికలు తరలించడంలో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. దుర్వాసన భరించలేక గెడ్డల పక్క నుంచి రాకపోకలు సాగించలేకపోతున్నాం. జోనల్ అధికారులు వార్డులో పర్యటించి సమస్య పరిష్కరించాలి. ఇక నుంచి గెడ్డల్లో నుంచి తొలగించిన పూడికను రెండు మూడు రోజుల్లో తరలించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

– కె.గోవిందరాజులు. రామ్మూర్తిపంతులుపేట.

ములగాడలో కాలుష్యంపై అధికారుల ఆరా



ఆర్‌డీఎక్స్ బాక్స్ నుంచి కాలుష్య సమస్య తెలుసుకుంటున్న అధికారులు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో గల కోరమాండల్, ఆలూఫ్లోరైడ్ పరిశ్రమల వల్ల ములగాడ, ములగాడ విలేజ్‌లో విపరీతంగా కాలుష్యం వెలువడుతోంది. ఈ కారణంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు శీతాకాలం కావడంతో కాలుష్య సమస్య మరింత ఎక్కువవుతోంది. ఈ సమస్యపై స్థానికులు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేయడంతో... వారు స్పందించి శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కాలుష్యం వల్ల ఎదుర్కుంటున్న సమస్యలను ఇంటింటికీ వెళ్లి స్థానిక నివాసులను అడిగి తెలుసుకున్నారు. ఆ రెండు గ్రామాల్లో ఆర్‌డీఎక్స్ బాక్స్ (ఆ ప్రాంతంలో కాలుష్యం ఎంత వరకు ప్రభావితం చేస్తుంది అని తెలుసుకునే పరికరం)లను ఏర్పాటు చేశారు. అందులో నమోదైన రీడింగ్‌ను అధికారులు ల్యాబ్‌కు తరలించారు. కార్యక్రమంలో ములగాడ విలేజ్ గ్రామ పెద్ద నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, తిప్పల గురుమూర్తిరెడ్డి

మల్కాపురం: నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనతో జీవీఎంసీ 58వ వార్డులో అనేక అభివృద్ధి పనులు చేపట్టిన కార్పొరేటర్ గులిగిందల లావణ్యను అభినందించకుండా ఉండలేమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. గడిచిన మూడేళ్లలో వార్డులో రూ.15 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో ఆమెను అభినందించే కార్యక్రమం శనివారం గుల్లలపాలెంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు గులిగిందల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని గత మూడేళ్లలో కార్పొరేటర్ లావణ్య అందించిన సేవలు వివరించారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకు డు తిప్పల గురుమూర్తిరెడ్డి, 40, 60, 62వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పి.వి.సురేష్, బల్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి డీఈవో అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం విదీషాలో జరిగిన అండర్ – 14 జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థి అక్కిరెడ్డి వెంకట ధనుష్ కాంస్య పతకం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దేముడు విద్యార్థితో కలిసి డీఈవో ప్రేమ్ కుమార్‌కు శనివారం విషయం తెలియజేశారు. జిల్లాకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం పట్ల డీఈవో అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు.

కోలాహలంగా గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపులో భక్తుల కోలాహలం

విశాఖ విద్య : ఎస్‌ఏడీ కొత్త రోడ్‌లో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన ఊరేగింపు కోలాహలంగా సాగింది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన పిండివంటలతో మహిళలు సారె ఊరేగించారు. అనంతరం పులివేషాలు, తప్పెట గుళ్లు, తీన్మార్ డప్పులు, బాణసంచా వెలుగులతో పురవీధుల్లో ఊరేగించి అమ్మవారి సన్నిధికి చేరి నైవేద్యం సమర్పించారు. ఆ పిండి వంటలను భక్తులకు ప్రసాదంగా పంచారు. అనంతరం సుమారు 3 వేల మందికి మహా అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అరకు గిరిజనుల సాంప్రదాయ నృత్యం, థింసా నృత్యం, తాడేపల్లిగూడెం వారిచే బిందెల డ్యాన్స్, విజయనగరం వారిచే పులివేషాలు, తప్పెట గుళ్లు, తాడుపెద్దు సాము గరిడీతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీ గౌరీ పరమేశ్వరులను నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో అసౌకర్యం కలుగకుండా కమిటీ పెద్దలు శ్రద్ధ తీసుకున్నారు.

పోర్టు ఆస్పత్రిని అభివృద్ధి చేయాలి



పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పోర్టు యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని, సొంత నిధులతో అభివృద్ధి చేసి నిర్వహించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా హాస్పిటల్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 47వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పోర్టులో వచ్చిన లాభాలతో గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని నిర్మించారన్నారు. ఇందులో కార్మికుల శ్రమదానం ఉందన్నారు. ఈ హాస్పిటల్ నడిపేందుకు 100 సంవత్సరాలకు సరిపడా రిజర్వు నిధులు పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ప్రైవేట్‌కి అప్పజెప్పాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని తెలిపారు. జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, కె.ఎస్.కుమార్, శంకర్రావు, నాయుడు, శ్రీను, గణేష్, రాఘవులు పాల్గొన్నారు.

19 నుంచి బాలల హక్కులపై అవగాహన శిబిరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రకాశరావు తదితరులు

ఎంవీపీకాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన శిబిరాల పోస్టర్‌ను బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించా రు. ఈ సంద ర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 19 నుంచి 21 వరకు వివిధ వేదికలపై శిబిరా లు జరుగుతాయని తెలిపారు. బాలల హక్కు లు, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తామన్నారు. 19న బీవీఎఫ్ స్కూల్, 20న ఏయూ సోషల్ వర్క్ విభాగం, 21న అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ లో శిబిరాలు ఏర్పా టు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు వైభవంగా పూజలు



పూజలో కార్పొరేటర్ కొణతాల సుధ, తదితరులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కే పురం వద్ద గల గౌరీ పరమేశ్వరుల ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద శనివారం పూజలు చేశారు. కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని దేవతామూర్తులకు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌కేపురం వద్ద నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయాల పవిత్రతను మనమంతా కాపాడుకోవాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు



ప్రాంతీయ ఉపాధి అధికారి అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని ప్రభుత్వ ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్‌కుమార్ అన్నారు. కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్ ప్రెన్యూర్‌షిప్‌లో అవకాశాలు అనే అంశంపై ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం చదువుతున్న విద్యార్థులు యూఎన్‌వో నుంచి నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ వరకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రాజెక్టులను ఏ విధంగా వినియోగించుకోవాలి, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం కోసం విద్యార్థులు కాలానుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రేమానందం మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి, ఉద్యోగ అవకావాశాలు అందిపుచ్చుకునేందుకు భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ హరిబాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ దంతేశ్వర్, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు.

ఇసుక లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

పెదగంట్యాడ: ఓ లారీ యజమాని నిర్లక్ష్యం.. డ్రైవర్‌కు ప్రాణసంకటకంగా మారింది.. హైడ్రాలిక్ ఫెయిల్ కావడంతో ఒక్కసారిగా ఇసుక లోడుతో ఉన్న లారీ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక బీసీ రోడ్డులో బిల్డింగ్ మెటీరియల్ విక్రయిస్తున్న శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌కు శుక్రవారం ఓ లారీ ఇసుక లోడుతో వచ్చింది.. ఇసుకను డంప్ చేస్తుండగా హైడ్రాలిక్ ఫెయిలైంది. దీంతో లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.లారీ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించాల్సిన బిల్డింగ్ మెటీరియల్ తనకేమీ పట్టనట్టు వ్యవహరించాడు. డ్రైవర్ చెవుల్లోంచి రక్తం కారుతున్నా పట్టించుకోలేదు. స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇచ్చినా స్పందన కరువైంది. 108 వాహనం కూడా చేరుకోకపోవడంతో తప్పని సరి పరిస్థితుల్లో స్థానికులు ఆ డ్రైవర్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలించారు..

లారీ యజమాని నిర్లక్ష్యం

శ్రీకాకుళానికి చెందిన లారీ ఓనర్ గొర్లె సింహాచలం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. లారీ కండిషన్‌ను పట్టించుకోకుండా వ్యాపారం.. లాభాపేక్ష తప్ప డ్రైవర్ భద్రతను గాలి కొదిలేశారని అంటున్నారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం, బాతువకు చెందిన గొంఢి సూర్యనారాయణ ఏడు నెలల నుంచి గొర్లె సింహాచలం వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బాతువ నుంచి శ్రీకాకుళం వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే లారీ బోల్తా పడిందని, డ్రైవర్‌కు గాయాలయ్యాయని సమాచారం అందుకున్న సింహాచలం దీమాగా సంఘటన స్థలానికి చేరుకున్నాడు. డ్రైవర్ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోకుండా లారీకి సంబంధించి ఇన్సూరెన్స్ లావాదేవీల్లో తలమునకలయ్యాడు.

ఏయూలో 'స్వచ్ఛతా హీ సేవా'



ఏయూ ప్రాంగణాన్ని శుభ్రం చేసిన విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ కేంద్రీయ గ్రంథాలయం, కన్వొకేషన్ హాల్ దగ్గర, లైబ్రరీ వెనుక భాగంలో ఉన్న చెట్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ హిందీ, ఎంఏ సోషల్ వర్క్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని వర్సిటీ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. డాక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎకో ఫ్రెండ్లీ, సోషల్ ఫ్రెండ్లీ వాతావరణం ఎప్పుడూ ఉంటుందన్నారు. లైబ్రరీ పరిసర ప్రాంతాల్లో కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు, సందర్శకులకు ఏయూ పచ్చతోరణంలా కళకళలాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా జాతీయ సేవా పథకం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి వలంటీర్స్ కుమారస్వామి, తేజస్విని, సాయి, పార్వతి, లావణ్య, కల్యాణ్ వనం, మహాలక్ష్మి, యాదగిరి, సౌరభ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఆస్పత్రి కార్మికుల మహాధర్నా

సీతమ్మధార: ఎంజీఎం–సెవెన్‌హిల్స్ ఆస్పత్రి యాజమాన్య తీరుకు వ్యతిరేకంగా కార్మికులు శనివారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద 24 గంటల మహాధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురిచేస్తోందన్నారు. హాస్పిటల్ ఆర్థిక సంక్షోభంలో ఉందని, అందుకే కార్మికులను తొలగిస్తున్నామని యాజమాన్యం కుంటిసాకు చెప్పి నిర్బంధంలో ఉంచి నోటీసులు మీద హెచ్ఆర్ అధికారి సంతకాలు చేయించడం చట్ట విరుద్ధమన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ కార్మికులను తొలగించి జూనియర్ కార్మికులను కొనసాగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఎంజీఎం సెవెన్‌హిల్స్ యాజమాన్యం నోటీసులు వెనక్కి తీసుకోకపోతే సమ్మె చేయడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. 15 రోజుల బకాయి జీతాలు పెనాల్టీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం సుబ్బారావు, కె.చంద్రశేఖరం, నూకరాజు, లావణ్య, రమణమ్మ వెంకటరావు, నాయుడు, పుష్ప, ఎస్.రవణమ్మ, సిహెచ్.ధనలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.